YouTube

# మరుగుపడ్డ మాణిక్యం

– గబ్బిట కృష్ణమోహన్

గులేబకావళి కథ అనగానే ముందు గుర్తుకొచ్చేది సినారె సినీప్రస్థానం; నన్ను దోచుకొందువటే వన్నెల దొరసానీ, సలామలేకుం సాహెబుగారూ, మదనా సుందర నాదొరా ... లాంటి యిప్పటికీ జన రంజకమైన వారి పాటలు. ఈ పాటల అడుగున మరుగుపడ్డ మరో మాణిక్యం – *కలల అలలపై తేలెను మనసు మల్లెపూవై* అంటూ సాగే సుమనోహర గీతం. అంతకుముందు ఇల్లరికం, జయభేరి సినిమాల్లో స్టేజి మీద సవాలు, ప్రతిసవాలుగా సాగే యుగళగీతాలు ప్రశ్న–జవాబుల రూపాన్ని సహజంగానే సంత రించుకున్నాయి. అయితే శృంగార ప్రధానమైన యుగళగీతాన్ని కూడా ఆ రూపంలో కూర్చి మెప్పించిన ఘనత సినారెగారిది. అంతేకాదు, సంవత్సరం తరవాత, 1963లో లక్షాధికారి చిత్రంలో మబ్బులో ఏముందీ, నా మనసులో ఏముంది? పాటలో మళ్ళీ అదే ప్రక్రియ చేసి భళా అనిపించుకున్నారు.

అంధుడైన తండ్రికి చూపు తెప్పించడం కోసం దేవలోకం నించి గులేబకాళి పుష్పం తేవాలని నాయకుడు వెళ్ళి, నిద్రిస్తున్న అందమైన దేవకన్యక (నటి పేరు నాగరత్నం అనుకుంటా?) అక్కడ కనబడితే ఆమె బుగ్గలకి చందనం అలదుతాడు. ఆ స్పర్శకు వులిక్కిపడి కలలలో తేలిపోతూ

**కలల అలలపై తేలెను మనసు మల్లెపూవై**

అంటూ ఆమె పాడితే, వెంటనే నాయకుడు

**ఎగసిపోదునో చెలియా నీవే యిక నేనై**

అని అందుకుంటాడు. ఈ పల్లవి వినిపించేది మళ్ళీ పాట చివరలోనే.

తరవాత కొలనులో స్నానం చేస్తూ నీడ రూపంలో నాయకుడు చిలిపిగా తొంగి చూస్తున్నట్టు అని పించి పెద్ద పెద్ద కళ్ళతో, అమాయకమైన చూపుల్తో, బుంగమూతి పెట్టి ఆ ముగ్ధ

**జలకమాడు జవరాలిని చిలిపిగ చూచేవెందుకు?**

అని ప్రశ్నించి వెంటనే తడిబట్టలతో కొలను బయటకి రాగానే, వొడ్డున నాయకుడు పరిపూర్ణరూపంలో కనిపించి ఆమెనే చూపిస్తూ

**తడిసీ తడియని కొంగున వొడలు దాచుకున్నందుకు**

అని జవాబిస్తాడు. క్రమంగా ముఖంలో అమాయకత్వం తొలగి కొంటెతనం చేరి, ఆ దేవకన్య

**చూపుతోనే హృదయవీణ ఝుమ్మనిపించేవెందుకు?**

అని అడిగితే దానికి నాయకుడి జవాబు

**విరిసీ విరియని పరువము మరులుగొలుపుతున్నందుకు.**

ఈసరికి జాణగా మారిన దేవకన్యక

**సడిసవ్వడి వినిపించని నడిరాతిరి ఏమన్నది?**

అని అడిగినదానికి

**జవరాలిని చెలికానిని జంటకూడి రమ్మన్నది**

అంటూ నాయకుడు ఔచిత్యంగా సమాధానమిస్తాడు. ఇద్దరూ కలిసి శయ్యాగృహానికి దారి తీసి, పూలతో అలంకరించిన పానుపుని చూపిస్తూ నర్మగర్భంగా దేవకన్యక

**విరజాజులు పరిమళించు విరులపానుపేమన్నది?**

అని అడిగితే, నాయకుడు

**అగుపించని ఆనందం బిగికౌగిట కలదన్నది**

అని ముగించగానే ఆ దేవకన్యక, *కలల అలలపై తేలెను ...* పల్లవి మరోసారి అందుకుంటుంది. అలా నాలుగు చరణాల్లో ప్రశ్న-జవాబుల రూపంలో కపోలం, అధరం, చుంబనం లాంటి పదాలు వాడకుండానే శృంగారరసాన్ని అంచెలంచెలుగా పరాకాష్టకు చేర్చారు సినారె.

ఇంత చక్కటి సాహిత్యానికి జోసెఫ్-కృష్ణమూర్తి ద్వయం (వాళ్ళకీ అదే మొదటి సినిమా, ముందు ఎం.ఎస్.విశ్వనాథన్ వద్ద సహాయకులుగా పనిచేశారు) అంతే చక్కటి బాణీ; పాటని డామినేట్ చెయ్యకుండా లలితంగా సాగే నేపథ్య సంగీతం; కమలాకర కామేశ్వరరావు చిత్రీకరణ; జానకి- ఘంటసాలల గానమాధుర్యం; రాకుమారుడంటే యిలానే వుండాలన్న సుమనోహర రూపంతో ఎన్టీఆర్, ముగ్ధగా దేవకన్యకల అభినయం ఆనాటి ప్రేక్షకులు చేసుకున్న సుకృతం. ధ్వని ప్రాధాన్యతకు పదప్రయోగాల్లో శబ్దాలంకారం (*జలకమాడు జవరాలిని; తడిసీ తడియని; విరిసీ విరియని పరువము మరులు; అగుపించని ఆనందం బిగికౌగిట*) విశేషంగా వాడి వీనులవిందు చేయడం కేవలం సినారెకే చెందిన ప్రత్యేకత. దీన్ని ప్రాసయతి అంటారని తెలుగు పండితులొకరు చెబుతూ, సినారెకి అది చాలా యిష్టం, దానికి ఆయనే సాటి అన్నారు. అవును, తోటలో నా రాజు ... (ఏకవీర) పాటలో ఎలనాగ నయనాల కమలాలలో దాగి ఎదలోన కదలే తుమ్మెద పాట విన్నాను పాదమూ, దాన్ని అజరామరంగా ఆలపించిన ఘంటసాల గాత్రమూ గుర్తుతెచ్చుకుందాం.

గులేబకావళి కథ సినిమా విడుదలై యాభయి సంవత్సరాలు నిండి, *కలల అలలపై ...* గీతం ప్రౌఢగా మారిన సందర్భంలో, 2012 జనవరి 6న, దాన్ని యూట్యూబులో బంధించి నిత్యయౌవనం ప్రసాదించిన రసజ్ఞుడికి కృతజ్ఞతలు. అవకాశం వున్నవాళ్ళు ఈ పాటని విడియోలో చూసి విని, ఆ తరవాత కళ్ళు మూసుకుని మరోసారి వొట్టి ఆడియో వింటే అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనవుతూ

సుమధురలోకంలోకి అడుగు పెట్టినట్టయి – మన వారసత్వం ఏం పోగొట్టుకుందా అని మనసు చివుక్కుమనడం తథ్యం.